## క్లుప్తంగా

### లైబ్రరీకి వస్తువుల వితరణ



లైబ్రరీకి కెనరా బ్యాంక్ అందించిన బీరువా, టేబుళ్లతో గ్రంథాలయ ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయానికి కెనరా బ్యాంక్ సీఎస్ఆర్ నిధుల ద్వారా సామగ్రి సమకూర్చింది. రూ.10,500 విలువైన ఇనుప బీరువా, రెండు ఫైబర్ టేబుళ్లు అందించారు. ఆయా సామగ్రిని బుధవారం జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు గ్రంథాలయాధికారి బి.సూర్యకళకు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్ మూర్తి, కార్యదర్శి వి.పైడిరాజు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్ఐ రమేష్

పెందుర్తి: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.అశోక్‌కుమార్ అన్నారు. ప్రమాదాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. స్థానిక నవోదయ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించిన వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. రాంగ్ రూట్ ప్రయాణం చాలా ప్రమాదకరం అన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

### కవిత్వం.. ఓ జీవనది

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో ఆంధ్రేతర భారతీయ కవిత్వం, పరిచయం అను అంశంపై డాక్టర్ కె.జి.వేణు ప్రసంగించారు. కవిత్వం ఒక అనుభూతి, ఒక రసానుభూతి అని, కొత్త రూపాలూ సంతరించుకుంటూ, కొత్త రుచులు పంచుకుంటూ ఒక జీవనదిలా సాగిపోతుందన్నారు. నిజాయితీపరమైన నిబద్ధత కలిగిన కవులు రాసే కవిత్వం గొప్పదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అటువంటి మంచి కవిత్వాన్ని అందించిన ఆంధ్రేతర కవులు సుబోధ్ సర్కార్, మనుష్య పుథిరన్, టి.పి.రాజన్, సీతాకాంత మహాపాత్ర, చాను షర్మిల, అమర్జీత్ చందన్, మందక్రాంత సేన్ తదితరుల గురించి వివరించారు. కార్యక్రమంలో రచయితలు శేఖరమంత్రి ప్రభాకర్, డి.వి. సూర్యారావు, కర్రా ప్రసాదరావు, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ పాల్గొన్నారు.

### 1021వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అన్యాయమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షల్లో 1021వ రోజు, బుధవారం సంస్థకు చెందిన సీవో, సీపీపీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రగతి బాట

- మండలంలో ప్రధాన రోడ్లకు మహర్దశ
- రూ.7.89 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం
- సాఫీగా సాగుతున్న ప్రయాణం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న మండల వాసులు




**నాడు:** గత టీడీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిని గాలికి వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు అష్టకష్టాలు పడేవారు. గుంతల వల్ల వాహనాలు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరిగేవి. వర్షాలు పడితే ఆయా మార్గాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారేది.

**నేడు:** మండలంలో శిథిలమైన ప్రధాన రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. కోట్లది రూపాయలతో రహదారులను ప్రధాన మార్గాలకు అనుసంధానం చేసింది. పల్లె ప్రజల కష్టాలకు చెక్ పెట్టింది.దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రధాన రోడ్లను రూ.7.89 కోట్లతో అభివృద్ధి చేసింది.

సబ్బవరం: మండలంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. దశాబ్దాల తరబడి కలగా మిగిలిన పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసి ఆ ప్రాంత వాసుల కళ్లలో ఆనందం నింపుతోంది. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. గుంతలు, రాళ్లు తేలిన రోడ్లకు చికిత్స చేస్తోంది. గ్రామీణ రోడ్లను సైతం విస్తరించి అభివృద్ధి చేసింది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ,అనకాపల్లి జిల్లాలకు సబ్బవరం ముఖద్వారం కావడంతో ప్రభుత్వ ప్రోత్సాహంతో పురోగతి దిశగా అడుగులు వేస్తోంది. మండలంలోని ప్రధాన రోడ్లకు మహర్దశ పట్టింది. టీడీపీ ప్రభుత్వంలో శిథిలమైన రోడ్లకు చికిత్స చేసింది. కొత్త రోడ్లు వేయడంతో పాటు విస్తరించడంతో తమ కష్టాలు తప్పాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

**నాడు తీవ్ర నిర్లక్ష్యం**

మండలంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ మారిటైం విశ్వవిద్యాలయం,ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. అయినా గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని గాలికి వదిలేసింది. అలాంటి అధ్వాన రోడ్లను నేడు ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మండలంలోని ప్రధాన గ్రామాలను అనుసంధానం చేసింది.

**రోడ్లు తళ తళ**

సబ్బవరం–చోడవరం రోడ్డులో సబ్బవరం నుంచి లింగాలతిరుగుడు వరకూ రూ.3.04 కోట్లతో రోడ్డు అభివృద్ధి చేశారు. సుమారు 7.2 కిలోమీటర్ల రోడ్డును 7 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. విశాఖ – చోడవరం ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డు మీదగా వెళ్లే అనేక మంది సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు.


- కె. కోటపాడు–పినగాడి రోడ్డును అయ్యన్నపాలెం నుంచి పినగాడి వరకూ రూ.2.50 కోట్లతో విస్తరించారు. సుమారు 6 కిలో మీటర్ల పొడవున 7 మీటర్లు వెడల్పుతో బీటీ రోడ్డు వేశారు. కె. కోటపాడు నుంచి పినగాడి మీదగా విశాఖకు వెళ్లే ఈ ప్రధాన రోడ్డు అనేక మండలాలను అనుసంధానం చేస్తుంది. ఈ రోడ్డు సబ్బవరం మండలంలోని అయ్యన్నపాలెం,గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం,మొగలిపురం గ్రామాల మీదుగా వెళ్తుంది.
- సబ్బవరం–వంగలి రోడ్డును మండలంలోని గొర్లివాని పాలెం జంక్షన్ నుంచి వంగలి గ్రామం రూ.60 లక్షలతో అభివృద్ధి చేశారు. 4.5 కిలో మీటర్ల పొడవున 3.75 మీటర్లు వెడల్పుతో బీటీ రోడ్డు వేశారు. ఇది సబ్బవరం నుంచి వంగలి మీదుగా కోటపాడు రోడ్డుకు అనుసంధానించారు. ఈ రోడ్డు గొర్లివానిపాలెంతో పాటు టిక్కలి పాలెం శివారు టి. జంగాలపాలెం, నాయనమ్మపాలెం గ్రామాలను అనుసంధానం చేస్తూ వంగలి వరకూ సాగుతుంది.
- సబ్బవరం–వెంకన్నపాలెం రోడ్డును పెదగొల్లలపాలెం వరకూ రూ.1.30 కోట్లతో అభివృద్ధి చేశారు. మండలంలోని గొర్లివానిపాలెం జంక్షన్ నుంచి గొర్లివానిపాలెం,పెదనాయుడుపాలెం,అసకపల్లి మీదగా గొల్లలపాలెం వరకూ 7.05 కిలోమీటర్ల పొడవున 3.75 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. ఇది సబ్బవరం–వెంకన్నపాలెం రోడ్డు నుంచి అగనంపూడి రోడ్లను అనుసంధానం చేస్తుంది.
- నక్కవానిపాలెం మీదుగా అనకపల్లి అగనంపూడి రోడ్డును సుమారు రూ.45 లక్షలతో 1.05 కిలో మీటర్లు పొడవున 3.75 మీటర్లు వెడల్పుతో విస్తరించారు.



గుంతలమయంగా ఉన్న పినగాడి సమీపంలోని కోటపాడు-పినగాడి రోడ్డు నాడు



అభివృద్ధి చేసిన పినగాడి సమీపంలోని కోటపాడు-పినగాడి రోడ్డు నేడు



నాడు :శిథిలమైన సబ్బవరం-లింగాలతిరుగుడు రోడ్డు



నేడు :అభివృద్ధి చేసిన సబ్బవరం-లింగాలతిరుగుడు రోడ్డు



శిథిలమైన సబ్బవరం-వంగలి రోడ్డు నాడు



సబ్బవరం-వంగలి రోడ్డు నేడు

### ఇబ్బందులు తీరాయి



సబ్బవరం నుంచి చోడవరం వెళ్లే రోడ్డు గతంలో అధ్వానంగా ఉండేది. దీంతో సబ్బవరం నుంచి మా గ్రామం రాయపుర అగ్రహారం సుమారు 8 కిలో మీటర్ల ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడేవారం. ఈ రోడ్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అభివృద్ధి చేసింది. దీంతో మాతో పాటు అనేక గ్రామాల ప్రజలు సాఫీగా ప్రయాణిస్తూ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. మా రహదారి కష్టాలు తీర్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–పిల్లల స్వామినాయుడు,రాయపుర అగ్రహారం,సబ్బవరం మండలం.

### సౌకర్యవంతంగా ఉంది



సబ్బవరం నుంచి వంగలి వెళ్లే రోడ్డు పలు చోట్ల తీవ్రంగా దెబ్బతింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే పలు గ్రామల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గుంతల వల్ల ప్రమాదాలు జరగడంతో పాటు వాహనాలు దెబ్బతినేవి. ఈ రోడ్డును అభివృద్ధి చేయడంతో టి. జంగాలపాలెం, నాయనమ్మపాలెం,వంగలి, ఒమ్మివానిపాలెం వంటి మా చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఎంతో మేలు కలిగింది. అదేవిధంగా కోటపాడు–సబ్బవరం రోడ్లకు అనుసంధానంగా ఉండే ఈ రోడ్డును అభివృద్ధి చేయడంతో మండల వాసులకు ఎంతో సౌకర్యంగా ఉంది.

–జి. హేమంత్,వంగలి,సబ్బవరం మండలం

### ఐదు రోడ్లు అభివృద్ధి చేశాం

ప్రభుత్వం రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తుంది.మండలంలోని 5 రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది.మండలంలోని లంకెలపాలెం–అసకపల్లి రోడ్డు, చోడవరం రోడ్డు నుంచి గొటివాడ మీదగా గుల్లేపల్లి రోడ్లను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి.త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయి. –పి కృష్ణారావు, రోడ్లు భవనాల శాఖ ఏఈ,సబ్బవరం మండలం

## సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి

- ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి
- పెదముషిడివాడలో ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్



పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు

పరవాడ: అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదముషిడివాడలో సర్పంచ్ పల్లా నాగమణి ఆధ్వర్యంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా సంక్షేమ పథకాలకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలతో దోపిడీకి పాల్పడితే ప్రస్తుత ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తుందన్నారు. ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాలన్న సంకల్పంతో జగనన్న సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని ఎంపీపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, గ్రామ సచివాలయ కన్వీనర్లు నందవరపు శ్రీనివాసరావు, బొండా అరుణకుమారి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు ఒమ్మి అర్జునరావు, యలమర్తి బుజ్జి, అలమండ నారాయణరావు, కిరణ్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లేగదూడల ప్రదర్శనకు విశేష స్పందన



లేగ దూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహన్ రావు తదితరులు

సబ్బవరం:మండలంలోని ఇరువాడ పాల సొసైటీ ఆవరణలో బుధవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన (సంకర జాతి ఆవుల) లేగ దూడల ప్రదర్శనకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. 100 మంది రైతులు తమ లేగ దూడలను తీసుకొచ్చారు. అత్యంత ఆసక్తికరంగా జరిగిన ఈ లేగ దూడల ప్రదర్శనలో బలిరెడ్డి సూరిబాబుకు చెందిన హెచ్ ఎఫ్ ఎక్స్16 జాతికి చెందిన లేక దూడ మొదటి బహుమతి కైవసం చేసుకుంది. బలిరెడ్డి నాగరాజుకు చెందిన జె ఎక్స్21 జాతికి చెందిన ఆవు దూడ ద్వితీయ బహుమతి గెలుచుకుంది. మజ్జి రాము అనే రైతుకు చెందిన ఎం 30 జాతి దూడ తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలైన రైతులకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న రైతులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతులు సంకరజాతి పశువుల ద్వారా అత్యధిక పాల ఉత్పత్తి సాధించేందుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పంటల కంటే పశు పోషణ మీద ఆదాయం అధికంగా లభిస్తుందని ఆయన అన్నారు.దేశవాళీ జాతులకు చెందిన ఆవులు ,గేదెల కన్నా సంకరజాతికి చెందిన సంతతిని ఉత్పత్తి చేసుకుంటే భవిష్యత్తులో రైతులు అత్యధిక లాభాలు సాధించే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. కరుణాకర రావు ,సబ్బవరం వెటర్నరీ ఉపసంచాలకురాలు డాక్టర్ కె.ఉషా కుమారి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత, అంతకపల్లి, గుల్లేపల్లి, డీ ఎల్ డీ ఏ పశువైద్యాధికారులు ఎస్ .సౌజన్య, అరుణ, బి . సంధ్య, శ్రీనివాసరావు పలు సూచనలిచ్చారు. పాల సొసైటీ అధ్యక్షుడు సంద్రాన అప్పారావు , నాయకులు కనకరాజు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, గ్రామ పెద్దలు మామిడి బంగారునాయుడు, దాడి సత్యనారాయణ, గళ్ల గోవింద, బలిరెడ్డి సూర్యప్రసాద్, బలిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రియురాలి మృతికి కారణమైన ప్రియుడి అరెస్టు

పరవాడ: ప్రియుడి మాయ మాటలు నమ్మి మోసపోయిన ఓ ప్రియురాలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో చోటుచేసుకొంది. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన అరిజిల్లి శ్రీను, అదే గ్రామానికి చెందిన కొవిరి ప్రియాంక కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శ్రీను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అవసరం తీర్చుకున్నాడు. ఇటీవల ప్రియాంక తనను పెళ్లి చేసుకోవాలని శ్రీనును కోరగా నేను నిన్ను పెళ్లి చేసుకోను చస్తే చావు అని వెళ్లిపోయాడు. దీంతో ప్రియాంక ఈ నెల 14 న సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగులు మందు తాగింది. వాకిట్లో వాంతులు చేసుకుంటుండగా స్పందించిన కుటుంబ సభ్యులు ఆటోలో వాడచీపురుపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఇంటికి చేరుకుంది. ఇంటికి చేరుకున్న తర్వాత పరిస్థితి విషమించడంతో గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ కూడా ప్రియాంక ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఈనెల 21న విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 27న ఉదయం 11 గంటలకు ప్రియాంక మృతి చెందింది. తమ కుమార్తె మృతికి ప్రియుడు అరిజిల్లి శ్రీను కారణమని మృతురాలి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు శ్రీనును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

## 11 కిలోల గంజాయి స్వాధీనం

గోపాలపట్నం: గంజాయి రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో నగర టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఎన్ఏడీ జంక్షన్‌లో ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి 11 కిలోల గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని తదుపరి విచారణ కోసం ఎయిర్ పోర్టు పోలీసులకు అప్పగించారు.

## ఉజ్వల భవిష్యత్తుకు ఓటే ఆయుధం



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ కనకారావు, ఎంపీడీవో హేమసుందరరావు

అగనంపూడి: దేశ భవిష్యత్తును మార్చే శక్తి ఓటుకు మాత్రమే ఉంటుందని పరవాడ తహసీల్దార్ కనకారావు, ఎంపీడీవో హేమసుందరరావు అన్నారు. లంకెలపాలెం సమీపంలోని నిస్ట్ కళాశాలలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరువాత కళాశాల నుంచి లంకెలపాలెం కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ముందుగా ఆన్‌లైన్ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే విధానం వివరించారు. తరువాత లంకెలపాలెం జాతీయ రహదారి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హైటెక్ ఐటీఐ ప్రిన్సిపాల్ దుర్గునాయుడు, నిస్ట్ కళాశాల డైరెక్టర్ ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## త్రిపురాంతకస్వామికి 108 కలశాలతో అభిషేకం



గంగధార నుంచి ప్రధాన కలశంతో వస్తున్న అర్చకులు, ఈవో శ్రీనివాసమూర్తి తదితరులు



త్రిపురాంతకస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయంలో చేపట్టిన వరుణ జపయాగంలో భాగంగా మూడోరోజు బుధవారం స్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. స్వామి సన్నిధిలో ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం జరిపి అనంతరం వైదికులు గంగధారకు వెళ్లి కలశాలతో జలాలు తీసుకొచ్చి స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు వి.రమణమూర్తి గంగా జలాలతో స్వామిని అభిషేకించి విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం వేద పండితుడు కాళ్ల కూరి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవోలు నరసింహరాజు, పాలూరి నరసింగరావు, సీనియర్ అసిస్టెంట్ వరహాలరావు, పీఆర్‌వో నాయుడు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం:రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని అసకపల్లి సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి.., పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించి మాట్లాడారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో మిగిలిన రాష్ట్రాలకు ఆయన విధానాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మహిళా సాధికారత దిశగా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తూ అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నరసింగరరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు,పార్టీ నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, సచివాలయ కన్వీనర్ కాపుశెట్టి నీలవేణి, ఈవోఆర్‌డీ మహేష్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణ మూర్తి, ఐడీ బాబు, యడ్ల నాయుడు పాల్గొన్నారు.